

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 13-03-2025 | సంపుటి - 21 | సంచిక - 321 | రూ : 4 | పేజీలు: 8



## 'యంగ్ ఇండియా' నిర్వహణ కార్పొరేట్ సంస్థలకివ్వాలి

- **అధికారులకు భట్టి ఆదేశం**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్వహణ కార్పొరేట్ సంస్థలకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఇంధన శాఖల బడ్జెట్ సమావేశాలు జరిగాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రతి యంగ్ ఇండియా పాఠశాల నిర్వాహణ బాధ్యతను ఒక్కో కార్పొరేట్ కంపెనీకి అప్పగిస్తామని, సంబంధిత కంపెనీ సామాజిక బాధ్యత కింద నిధులు ఇస్తుందని పరిశ్రమల శాఖ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ''భారీ పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను దశలవారీగా విడుదల చేస్తామన్నారు. లెదర్ పార్కులకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. మూడో శ్రేణి పట్టణాలకు ఐటీ టవర్స్ విస్తరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. హైదరాబాద్‌లో ప్రగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. హరిత ఇంధన ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని భట్టి అన్నారు. వేసవిలో పంటలు ఎండిపోకుండా విద్యుత్ ఉన్నత అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రాధాన్య రంగమైన ఇంధన శాఖకు ఆ మేరకు బడ్జెట్లో కేటాయింపులు ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు.

## 'స్మార్ట్ రేషన్ కార్డు'ల జారీకి సన్నాహాలు

- **డిజైన్లను పరిశీలిస్తున్న ప్రభుత్వం**

హైదరాబాద్: కొత్త రేషన్‌కార్డులను 'స్మార్ట్' కార్డుల రూపంలో ఇచ్చేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధం అవుతోంది. ప్రతి స్మార్ట్ రేషన్ కార్డుకు ఓ క్యూఆర్ కోడ్ పెట్టాలని నిర్ణయించింది. స్మార్ట్ కార్డు ఎలా ఉండాలన్న విషయంపై వివిధ రకాల డిజైన్లను పరిశీలిస్తోంది. ఈ డిజైన్ల ప్రక్రియ కొద్దిరోజుల్లో కొలిక్కి రానున్నట్లు సమాచారం.

**కార్డుల సరఫరాకు టెండర్లు**

రాష్ట్రంలో దాదాపు 90 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారిలోనూ అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలి. ఆయా జిల్లాల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయింది. నిజానికి ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో మార్చి 1 నుంచి మిగతా జిల్లాల్లో మార్చి 8వ తేదీ తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'స్మార్ట్' కార్డు రూపంలో రేషన్‌కార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో జారీ ప్రక్రియ ఆలస్యం కానున్నట్లు తెలిసింది. కొత్త వారితో పాటు ఇప్పటికే రేషన్‌కార్డు ఉన్నవారికి సైతం స్మార్ట్ రేషన్‌కార్డులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ టెండర్లు పిలిచింది. బిడ్ల దాఖలుకు మార్చి 25వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ప్రీబిడ్ సమావేశాన్ని మార్చి 17న నిర్వహిస్తామని పేర్కొంది. కుటుంబ యజమానిగా మహిళల పేరుతోనే

తరువాయి 2లో






## ప్రజలే కేంద్రంగా పాలన

- **సమృద్ధి, సమానత్వం, పురోగతిలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ**
- **అపరిమిత అవకాశాల దిశగా వేగవంతంగా ప్రయాణం**
- **వెన్నుదన్నుగా నిలుస్తున్న నిర్ణయాత్మక నాయకత్వం, ధైర్యంగా సంస్కరణలు**
- **గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**
- **ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగం**

హైదరాబాద్: సమృద్ధి, సమానత్వం, పురోగతిలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలుస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. సామాజికన్యాయంతో వినూత్నంగా అపరిమిత అవకాశాల దిశగా ప్రయాణం వేగవంతంగా సాగుతోందని అభివర్ణించారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందన్నారు. ఇందుకు ధైర్యవంతమైన సంస్కరణలు, నిర్ణయాత్మక నాయకత్వం వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్ర కొత్త బడ్జెట్ పురోగతికి మార్గనిర్దేశం చేస్తుందని భరోసా ఇచ్చారు. బుధవారం తెలంగాణ 202526 బడ్జెట్ సమావేశాల మొదటి రోజున ఆయన ఉభయసభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు.

తరువాయి 2లో



## ఏపీ ఈఏపీసెట్ నోటిఫికేషన్ విడుదల

- **ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

అమరావతి: ఇంజినీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 24 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అపరాధ రుసుముతో మే 16 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తులో తప్పుల సవరణకు మే 6 నుంచి 8 వరకు సమయం ఇచ్చారు. మే 12 నుంచి

తరువాయి 2లో

## డీలిమిటేషన్‌తో అసెంబ్లీకి 75 మంది మహిళలు

- **1.75 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి**
- **తెదేపాతోనే స్త్రీ సాధికారతకు బీజం**

2లో



## వ్యూహాత్మక భాగస్వాములుగా భారత్, మారిషస్

- **ప్రధానులు మోదీ, రామ్‌గులాం నిర్ణయం**

పోర్ట్ లూయీ: భారత్, మారిషస్ తమ మధ్య గల ద్వైపాక్షిక సంబంధాలను ఉన్నతస్థాయికి తీసుకువెళ్తూ మెరుగైన వ్యూహాత్మక భాగస్వాములుగా మారాయి. వాణిజ్యం, సముద్ర భద్రత వంటి వివిధ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునే దిశగా 8 ఒప్పందాలను

తరువాయి 2లో





## విజయవాడలో జీఎస్ఐ క్యాంపు కార్యాలయం

- **: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

దిల్లీ: విజయవాడలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. 'ఏపీలో చాలా ఖనిజ నిల్వలున్నాయి. 93% బైరైటీస్, 90% సున్నపురాయి రాష్ట్రం నుంచే ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఇప్పటివరకు ఏపీలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా

తరువాయి 2లో

## రైలు హైజాక్ ఘటన.. ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది

- **: పాక్ ఆర్మీ**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో రైలు హైజాక్ అయిన ఘటనలో మొత్తం 21 మంది ప్రయాణికులతో పాటు నలుగురు పారామిలిటరీ సైనికులు మృతి చెందినట్లు పాక్ ఆర్మీ జనరల్ పేర్కొన్నారు. పాక్ భద్రతా బలగాల కాల్పుల్లో మొత్తం 33 మంది మిలిటెంట్లు మృతి చెందారని ఆర్మీ అధికార ప్రతినిధి, లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. రైలులో ఉన్న అందరు మిలిటెంట్లను భద్రతా బలగాలు హతమార్చాయని, ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని ఆయన పేర్కొన్నారు. మిగిలిన ప్రయాణికులను కాపాడామని వెల్లడించారు. బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వతప్రాంతమైన క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ వెళ్తున్న బలోచ్ లిబరేషన్ ఆర్మీ మిలిటెంట్లు రైలును హైజాక్ చేసిన

తరువాయి 2లో



# ప్రజలే కేంద్రంగా పాలన

(మొదటిపేజీ తరువాయి)

### రైతులే రాష్ట్రానికి ఆత్మ...

''మా ప్రభుత్వం సామాజిక న్యాయం, సంక్షేమానికి కట్టుబడి ఉంది. అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. రైతులే తెలంగాణ ఆత్మ. వారికి మద్దతివ్వడం, శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే మా బాధ్యత. దేశంలోనే అత్యధికంగా 260 లక్షల టన్నుల ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ. రుణమాఫీలో భాగంగా రూ.20,616.89 కోట్లతో 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించాం. రైతుభరోసా కింద ఎకరానికి ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నాం. భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12 వేలు ఇస్తున్నాం. సన్నరకాలను పండించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ కింద రూ.1,206.44 కోట్లు విడుదల చేశాం.

### మహిళలకు కొత్త అవకాశాలు

ప్రభుత్వం మహిళలకు కొత్త అవకాశాలను కల్పిస్తోంది. ఇందిరా మహిళాశక్తి మిషన్ ద్వారా రూ.లక్ష కోట్ల ఆర్థిక సహాయం అందించి వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం. మహాలక్ష్మి పథకం గేమ్‌ఛేంజర్. దాని ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. మహిళలకు 1,000 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్రాజెక్టుల నిర్వహణను అప్పగిస్తున్నాం.

### యువతకు చేయూత

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా యువతలో నైపుణ్యాలను పెంచుతున్నాం. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు అగ్రశ్రేణి శిక్షణ ఇస్తున్నాం. సివిల్ సర్వీసు పరీక్షల ఆశావహుల కోసం 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' చేపట్టాం. క్రీడల్లో ప్రపంచస్థాయి అథ్లెట్ల తయారీకి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటుపై దృష్టి పెట్టాం. పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌కు ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. సమర్థమైన విపత్తు ప్రతిస్పందన యంత్రాంగం కోసం ప్రత్యేకదళం ఏర్పాటు చేసింది.

### విద్యావ్యవస్థలో మార్పులు

ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు డైట్ ఛార్జీలను 40%, కాస్మెటిక్ ఛార్జీలను 200% పెంచాం. సమీకృత గురుకుల పాఠశాలల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సమానావకాశాలు కల్పించనున్నాం. విద్యావిధానాన్ని పటిష్ఠం చేసేందుకు విద్యాకమిషన్ ఏర్పాటు చేశాం. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధిలో మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పించాం.

### పేదలకు మరింత చేరువైన వైద్యం

ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షల వరకు పెంచి, కొత్తగా 163 చికిత్సలను చేర్చడంతో వైద్యం పేదలకు మరింత చేరువైంది. ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్యం అందిస్తున్నాం.

### మార్పు దిశగా...

సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ద్వారా మార్పు దిశగా చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో చేపట్టిన సర్వే ఆధారంగా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం బిల్లు ప్రతిపాదించింది. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ కోసం బిల్లును ప్రవేశపెట్టనుంది. కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయబద్ధమైన వాటాను పరిరక్షించుకోవడానికి ట్రైబ్యునల్ 2 సమక్షంలో ప్రభుత్వం వాదనలను వినిపించింది. నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో భూవివాదాల పరిష్కారం, భూరికార్డుల పారదర్శకత, యాజమాన్యానికి రక్షణ కలుగుతుంది.

### పట్టణ, పారిశ్రామిక వృద్ధిలో...

మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ద్వారా పట్టణ జీవితాన్ని, ఆర్థిక సామర్థ్యాన్ని పునర్‌నిర్వచించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దేశంలోనే తొలి నెట్‌జీరో సిటీగా, ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను ప్రోత్సహించడానికి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తోంది. శాసనమండలి, శాసనసభసభ్యులు అత్యంత ఆసక్తితో, శ్రద్ధతో బడ్జెట్ చర్చల్లో పాల్గొనాలి.

### చెక్కుచెదరని సంకల్పంతో...

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వ సంకల్పం దృఢమైనది. ప్రతి పథకం, ప్రతి విధానం, ప్రతి కార్యక్రమం... అవకాశాల కల్పన, ప్రజల సాధికారత, సమీకృత వృద్ధికి నిర్దేశించినది. వ్యవసాయ పరిపుష్టి, వినూత్న, సాంకేతిక ఆవిష్కరణలు, సామాజిక న్యాయం, మానవశక్తితో అగ్రగామిగా నిలవనుంది'' అని గవర్నర్ తెలిపారు. సభలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌తో అసెంబ్లీకి 75 మంది మహిళలు

అమరావతి : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పూర్తయితే భవిష్యత్తులో సుమారు 75 మంది మహిళలు శాసనసభకు వస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గత ఎన్నికల్లో 22 మంది మహిళలకు టికెట్లు ఇస్తే తెదేపా తరఫున 20 మంది, జనసేన తరఫున ఒకరు గెలిచి సభకు వచ్చారని ఆయన చెప్పారు. డీలిమిటేషన్ పూర్తయితే.. శాసనసభలో మహిళల ఆధిక్యం మరింత పెరుగుతుందని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో మహిళా సాధికారత తెదేపా హయాంలోనే ప్రారంభమైందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళల్లో 1.75 లక్షల మందిని ఏడాదిలోగా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ లక్ష్యసాధనకు ఎమ్మెల్యేలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం వెయ్యి మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. శాసనసభలో బుధవారం 'మహిళా సాధికారత' అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలూ ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. డ్వాక్రా మహిళలు తీసుకునే రూ.60 వేల కోట్ల రుణాల్లో సగం పారిశ్రామికవేత్తలుగా పెట్టుబడి పెడితే రూ.6 వేల కోట్ల వరకు లాభం వస్తుందన్నారు. ఈ లక్ష్య సాధన చర్యలను మార్చి, జూన్, సెప్టెంబరు, డిసెంబరు నెలల్లో ఒక్కో జిల్లాకు వెళ్లి పరిశీలిస్తానని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ కోసం ప్రపంచంలోని ప్రధాన ఏజెన్సీలతో ఒప్పందాలు చేసుకుంటామన్నారు. ఈ నెలలోనే పి4 విధానాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

* **సంతానం విషయంలో రివర్స్ బిల్లు తేవాల్సిన పరిస్థితి**

'ఒకప్పుడు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువగా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హత లేదు. ఇప్పుడు దాన్ని తొలగించాం. ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉంటే పోటీకి అర్హులు కాదని బిల్లు తీసుకురావాల్సిన అవసరం ఉంది. డబ్బున్నవారంతా పరిశ్రమలు పెట్టడం తేలిక.. పిల్లలను కనిపెంచడం కష్టమని చెబుతున్నారు. ప్రతి కార్యాలయంలో చైల్డ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తాం.

* **సమాన ఆస్తి హక్కుతో ప్రారంభమై..**

తల్లిదండ్రుల ఆస్తిలో మహిళలకు సమాన ఆస్తి హక్కును కల్పించిన ఘనత దివంగత ఎన్టీఆర్‌దే. మా ప్రభుత్వ హయాంలోనే తొలిసారి విద్య, ఉద్యోగ రంగాల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించాం. ప్రస్తుత మన మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి.. మేం తెచ్చిన రిజర్వేషన్ విధానం వల్లే గ్రూపు 1 ఉద్యోగాన్ని పొంది ఈరోజు ఇక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు (ఈ ప్రసంగ సమయంలో సూర్యకుమారి అక్కడే ఉన్నారు). స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించాం. డ్వాక్రా సంఘాల మద్దతుతో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేపడతాం. ర్యాపిడో సంస్థ ద్వారా మహిళలకూ ఉపాధి కల్పించేందుకు ఒప్పందం చేసుకున్నాం. 25 వేల మందికి శిక్షణ ఇప్పించేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థతోనూ ఒప్పందం కుదిరింది. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు ఆర్థిక ప్రయోజనాలు పెంచాం. ప్రసూతి సెలవులు అదనంగా మంజూరు చేశాం. వచ్చే మే నుంచి 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభిస్తాం. ఎంతమంది పిల్లలున్నా వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం.

* **తల్లికీ, చెల్లికీ న్యాయం చేయని జగన్**

తల్లికీ, చెల్లికీ ఆస్తిలో వాటా ఇవ్వని వ్యక్తి ఇటీవల వరకు ఇదే సభలో సీఎంగా వ్యవహరించారు. ఇలాంటి వ్యక్తి సమాజానికి ఏం న్యాయం చేస్తారు? సరస్వతి సిమెంట్స్ కంపెనీ వాటాల విషయంలో తల్లికీ, చెల్లికీ వ్యతిరేకంగా జగన్ కోర్టుకెళ్లారు. ఈ చర్య మహిళలను వేధించడమే. ఆడబిడ్డలకు ద్రోహం చేసేలా జగన్ పాలన సాగింది. మహిళల భద్రత కోసం 13 రకాల ఫీచర్లతో శక్తి యాప్‌ను తెచ్చాం. ఆడబిడ్డల జోలికి వచ్చిన సైకోలను వదిలిపెట్టం. మహిళలను అగౌరవపరిచినా, సామాజిక మాధ్యమాల్లో వేధించినా శిక్షిస్తాం.

* **అమరావతి మహిళల పోరాటం ఓ చరిత్ర**

రాష్ట్ర రాజధాని కోసం ఐదేళ్లపాటు వీరోచితంగా పోరాడిన అమరావతి మహిళల త్యాగం.. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ ప్రాంత మహిళల చొరవ వల్లే అమరావతి బతికింది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

* **శాసనసభ ఆవరణలో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయాలి**

శాసనసభ ఆవరణలో అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేయాలని సభాపతి అయ్యన్నపాత్రుణ్ని సీఎం కోరారు. పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్ ఇప్పటికే ఏర్పాటైందని తెలిపారు.

# వ్యూహాత్మక భాగస్వాములుగా భారత్, మారిషస్

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం కుదుర్చుకున్నాయి. సరిహద్దు లావాదేవీల్లో స్థానిక కరెన్సీని ప్రోత్సహించడం, సముద్ర సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం, నగదు అక్రమ చలామణిపై ఉమ్మడి పోరు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి సహకారం పెంపు వంటి అంశాలను తాజా ఒడంబడికల్లో ప్రస్తావించారు. భారత ప్రధాని మోదీ, మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులాంల సమక్షంలో సంబంధిత అధికారులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. అంతకుముందు ఇద్దరు నేతలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా దక్షిణార్ధ గోళ దేశాలపై భారత నూతన దృక్కోణాన్ని మోదీ ప్రకటించారు. దానికి మహాసాగర్ (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్) అని పేరు పెట్టారు. తాజా విధానంలో అభివృద్ధి లక్ష్యంగా వాణిజ్యం, సుస్థిర అభివృద్ధి కోసం సామర్థ్యాల నిర్మాణం, ఉమ్మడి భవిష్యత్తు కోసం పరస్పర భద్రత, సాంకేతికత బదిలీ, రాయితీపై రుణాలు, గ్రాంట్లు వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. హిందూ మహాసముద్రంలో చైనా తన ఉనికిని పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో మోదీ తాజా విధానాన్ని ప్రకటించారు. మారిషస్ ప్రత్యేక ఆర్థిక జోన్ భద్రతకు పూర్తి సహకారాన్ని అందిస్తామని మీడియా ప్రకటనలో మోదీ తెలిపారు.

* **మారిషస్ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీ**

మారిషస్‌లో తన రెండవ రోజు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పోర్ట్ లూయిలోని చాంప్ డి మార్స్ వద్ద జరిగిన ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారత సైన్యానికి చెందిన దళాలు, వాయుసేనకు చెందిన ఆకాశ్ గంగా స్కైడైవింగ్ బృందం కవాతులో పాల్గొన్నాయి. మారిషస్ అత్యున్నత పురస్కారం 'ద గ్రాండ్ కమాండ్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ అండ్ కీ ఆఫ్ ద ఇండియన్ ఓషన్'ను ప్రధాని మోదీ బుధవారం అందుకున్నారు. మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ప్రధాని మోదీకి ఆ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

## 'స్మార్ట్ రేషన్ కార్డు'ల జారీకి సన్నాహాలు

(మొదటిపేజీ తరువాయి)

రేషన్‌కార్డులు ఉన్నాయి. స్మార్ట్ రేషన్‌కార్డులను మహిళల ఫొటోతోనే జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. రేషన్ షాపునకు వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆ కుటుంబంలో రేషన్ అర్హుల వివరాలన్నీ వస్తాయని సమాచారం. ఈ విధానానికి సంబంధించి తెలంగాణ ఉన్నతాధికారుల బృందం రాజస్థాన్, కర్ణాటక, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లో గతేడాదే అధ్యయనం చేసింది.

## ఏపీ ఈఏపీసెట్ నోటిఫికేషన్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 'మనమిత్ర' వాట్సప్ ద్వారా అభ్యర్థులు హాల్‌టికెట్లు పొందొచ్చు. వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష మే 19, 20 తేదీల్లో రోజుకు రెండు విడతలుగా ఉంటుంది. ఇంజినీరింగ్ పరీక్ష మే 21 నుంచి 27 వరకు రోజుకు రెండు విడతలుగా నిర్వహిస్తారు. వ్యవసాయ, ఫార్మసీ పరీక్ష ప్రాథమిక 'కీ'ని మే 21న, ఇంజినీరింగ్ ప్రాథమిక 'కీ'ని మే 28న విడుదల చేస్తారు. తుది 'కీ'ని జూన్ 5న ప్రకటిస్తారు.

### మే 6న ఈసెట్

బీటెక్ రెండో ఏడాదిలో ప్రవేశానికి నిర్వహించే ఈసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 7 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. అపరాధ రుసుముతో ఏప్రిల్ 28 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తులో తప్పుల సవరణకు ఏప్రిల్ 24 నుంచి 26 వరకు సమయం ఇచ్చారు. మే 1 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 6న ప్రవేశ పరీక్ష ఉంటుంది.

### మే 7న ఏపీ ఐసెట్

ఉన్నత విద్యా సంస్థల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఐసెట్‌కు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులకు ఏప్రిల్ 9 చివరి గడువుగా విధించారు. అపరాధ రుసుముతో ఏప్రిల్ 28 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తులో తప్పుల సవరణకు ఏప్రిల్ 29 నుంచి 30 వరకు సమయం ఇచ్చారు. మే 2 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

* **ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు.. 18 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 17 నుంచి దరఖాస్తులకు రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. 18 నుంచి మే 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ సీట్లు కేటాయిస్తారు. పాఠశాలల వారీగా మెరిట్ జాబితాను మే 24న ప్రదర్శిస్తారు. విద్యార్థుల ఎంపిక జాబితాను 26న విడుదల చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన 27న ఉంటుంది.

## విజయవాడలో జీఎస్ఐ క్యాంపు కార్యాలయం

(మొదటిపేజీ తరువాయి)

స్టేట్ యూనిట్ ఏర్పాటు చేయలేదు. ఒకవేళ చేస్తే ఎప్పటి లోపు చేస్తారు' అని ఎంపీ ప్రశ్నించారు. దానికి కిషన్‌రెడ్డి బదులిస్తూ.. ఈ సంవత్సరం జీఎస్ఐ 175వ వార్షికోత్సవాన్ని జరుపుకోబోతోందని, ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి విజయవాడలో తప్పకుండా జీఎస్ఐ క్యాంప్ ఆఫీసు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## రైలు హైజాక్ ఘటన.. ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. ఘటన జరిగిన సమయంలో 9 కోచ్‌లలో మొత్తం 440 మంది ప్యాసింజర్లు ఉన్నారు. ఈ ఘటనకు తామే బాధ్యులమని బీఎల్ఏ మిలిటెంట్లు ప్రకటించారు. దీంతో రంగంలోకి దిగిన బలగాలు విజయవంతంగా రైలును తమ నియంత్రణలోకి తీసుకున్నాయి. రైలు హైజాక్ ఘటనకు సంబంధించి లెఫ్టినెంట్ జనరల్ షరీఫ్ ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడారు. ''మార్చి 11న మధ్యాహ్నం 1 గంట సమయంలో బలోచ్ మిలిటెంట్లు రైల్వే ట్రాక్ పేల్చేసి రైలును తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఆ ప్రాంతమంతా కష్టతరమైన భూభాగం. మిలిటెంట్లు ప్రయాణికులను రక్షణ కవచాలుగా ఉపయోగించుకున్నారు. వెంటనే ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, ఫ్రాంటియర్ కార్ప్స్, స్పెషల్ సర్వీస్ గ్రూప్ కమాండోస్‌తో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాం. ఈ ఆపరేషన్ సమయంలో మిలిటెంట్లు అఫ్గాన్‌లోని తమ సహాయకులు, సూత్రధారులతో శాటిలైట్ ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు చర్చలు జరిపారు. ప్రయాణికులను రక్షణ కవచాలుగా ఉంచుకోవడంతో ఈ ఆపరేషన్ ముగించడానికి సమయం పట్టింది. మంగళవారం సాయంత్రానికి 100 మంది ప్యాసింజర్లను సురక్షితంగా కాపాడాం. ఇక బుధవారం మిగిలిన మొత్తం ప్రయాణికులను కాపాడాం. ఈ ఆపరేషన్ అత్యంత కచ్చితత్వంతోపాటు, జాగ్రత్తగా చేయాల్సి వచ్చింది. ఆత్మాహుతి బాంబర్లను మొదట స్నిపర్స్ చంపేశారు. అనంతరం ఒక్కో కంపార్ట్‌మెంట్‌లోని టెర్రరిస్టులను హతమారుస్తూ వచ్చాం. తమ ఆరరేషన్ సమయంలో ప్రయాణికులకు ఎవరికి ఏం జరగలేదు. ప్రస్తుతం ఘటన ప్రాంతంలో మిలిటెంట్లు ఎవరూ బతికిలేరు. అయితే బాంబు నిర్వీర్య దళం రైలును చెక్ చేస్తోంది. తమ ఆపరేషన్ కొనసాగుతున్న సమయంలో పారిపోయిన ప్రయాణికులను ఒక్కదగ్గరికి చేర్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

## రైళ్లలో మెనూ ప్రదర్శన తప్పనిసరి

**: అశ్వినీ వైష్ణవ్**

దిల్లీ: రైళ్లలో అందించే ఆహార పదార్థాల మెనూ, ధరల పట్టిక వివరాలు ప్రయాణికులకు తెలియజేసేలా ప్రదర్శించడం తప్పనిసరి అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభకు తెలిపారు. ప్రయాణికుల సమాచారం కోసం రైళ్లలో అందుబాటులో ఉన్న ఆహార పదార్థాల మెనూ కార్డు, ధరలు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, ముద్రించిన మెనూ కార్డులు వెయిటర్ల వద్ద అందుబాటులో ఉంచామని, ప్రయాణికులు అడిగితే వాటిని అందిస్తామని ఆయన లిఖిత పూర్వకంగా సభకు తెలియజేశారు.

# భాషపై భావోద్వేగం!

* **జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రం**

* **దీనిపై ఎందుకింత రచ్చ?**

దిల్లీ: జాతీయ విద్యా విధానంలోని (ఎన్ఈపీ 2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ భావోద్వేగాలు రగిలాయి. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

### ఏమిటీ త్రిభాషా సూత్రం?

విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఎన్ఈపీ 2020 సిఫార్సు చేస్తోంది. ఇందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి. ఈ ఫార్ములా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. అయితే విద్యార్థులకు నేర్పాల్సిన భాషలేమిటన్నది నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలదే.

* **ఏయే తరగతులకు వర్తిస్తుంది?**

పిల్లలకు ఐదో తరగతి వరకూ తప్పనిసరిగా మాతృభాషలోగానీ, స్థానిక భాషలోగానీ, ప్రాంతీయ భాషలోగానీ సబ్జెక్టులను (మీడియం) బోధించాలి. ఆ తర్వాతా 8, ఆపై తరగతుల్లోనూ స్థానిక మీడియాల్లో బోధన సాగితే బాగుంటుంది.

### పుట్టుపూర్వోత్తరాలేమిటి?

త్రిభాషా సూత్రాన్ని మొట్టమొదటి సారిగా కొఠారి కమిషన్ (196468) సూచించింది. దీన్ని అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 1968 నాటి జాతీయ విద్యా విధానంలో పొందుపరిచారు. రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న రోజుల్లో పునర్వ్యవస్థీకరించి ఎన్‌పీఈ 1986 పేరుతో అమల్లోకి తెచ్చారు. 1992లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం జాతీయ సమైక్యత, భాషా వైవిధ్యం పెంపొందించే దిశగా ఈ విధానానికి సవరణలు చేసింది. ఈ ఫార్ములా కింద మాతృభాష, ప్రాంతీయ భాష, అధికార భాష (ఆంగ్లంతో సహా), మరో ఆధునిక భారతీయ భాష, యూరోపియన్ భాష నేర్పాలని ప్రతిపాదించారు.

* **ఎన్ఈపీ-2020 ఏం చెబుతోంది?**

పాఠశాల స్థాయిలోనే బహుభాషా తత్వాన్ని పెంపొందించడానికి త్రిభాషా సూత్రాన్ని సత్వరం అమలు చేయాలని ఎన్ఈపీ2020 చెబుతోంది. రాజ్యాంగ నిర్దేశాలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు బహుభాషా తత్వాన్ని ప్రోత్సహించి జాతీయ సమైక్యతను సాధించేందుకు ఇది అవసరమని అభిప్రాయపడింది.

* **రాష్ట్రాలపై భాషలను రుద్దే ప్రయత్నమా ఇది?**

త్రిభాషా సూత్రం అమలులో వెసులుబాటు ఉంటుందని, ఏ రాష్ట్రంపైనా.. ఏ భాషనూ రుద్దబోమని ఎన్ఈపీ2020 చెబుతోంది. రాష్ట్రాలు, ప్రాంతాలు, ముఖ్యంగా విద్యార్థులు ఎంచుకునే మూడు భాషలనే ఈ విధానం కింద నేర్పుతారు. అయితే మూడు భాషల్లో రెండు భారతీయ భాషలై ఉండాలి.

* **విదేశీ భాషల సంగతేంటి?**

విద్యార్థులు మాధ్యమిక పాఠశాల స్థాయిలో భారతీయ భాషలు, ఆంగ్లంతోపాటు కొరియన్, జపనీస్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలూ అభ్యసించవచ్చని ఎన్ఈపీ2020 చెబుతోంది. అధిక శాతం పాఠశాలల్లో భాషా మాధ్యమంగా ఉన్న ఆంగ్లాన్ని విదేశీ భాషగా పరిగణిస్తారు. అందుకే ఈ భాషను ఎంచుకునే విద్యార్థులు రెండు భారతీయ భాషలను ఎంచుకోవాల్సి ఉంటుంది.

* **తమిళనాడు వాదన ఏమిటి?**

ఆది నుంచీ త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు వ్యతిరేకిస్తోంది. 1937లో సి.రాజగోపాలాచారి నేతృత్వంలోని మద్రాస్ ప్రభుత్వం పాఠశాలల్లో తప్పనిసరిగా హిందీ నేర్పాలన్న విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిపై జస్టిస్ పార్టీ నాయకులతోపాటు పెరియార్ వంటి ద్రవిడ భావజాల నాయకులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో ఈ విధానాన్ని 1940లో రద్దు చేశారు.

# కాంగ్రెస్ నిరంకుశ పాలనలో హిందూ దేవాలయాలకు, హిందువులకు రక్షణ లేదు

* **భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : కాంగ్రెస్ నిరంకుశ పాలనలో హిందూ దేవాలయాలకు, హిందువులకు రక్షణ లేదని భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాంధీ నగర్ లోని శ్రీ రామలింగేశ్వర శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున దుండుగులు పాదరక్షలతో ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారి ఆభరణాలను దొంగిలించిన అంశంపై భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాదరక్షలతో ఆలయంలోకి ప్రవేశించడం హిందువుల మనోభావాలను దెబ్బ తీసే ప్రయత్నమేనని ఆలయ శుద్ధి కార్యక్రమం చేపట్టారు, అనంతరం భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ పెద్దలు మల్లారెడ్డి తో కలిసి శివాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ఆలయ భద్రతా చర్యల్లో భాగంగా చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇకనైనా హిందువులు సంఘటితం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు, మొన్న సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి, నేడు గాంధీనగర్ శివాలయ సంఘటన, ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇలాంటి దాడుల విషయంలో రాష్ట్రం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే యావన్మంది హిందువుల ఆగ్రహావేశాలకు గురికాక తప్పదని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంతారావు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఒబిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, నాయకులు పద్మయ్య, శ్రీనివాస్ గౌడ్, శంకర్ రెడ్డి, వేణు, గోపాల్ పలువురు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రాం

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇవ్వనున్నట్లు హైదరాబాద్‌లోని బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారని రాజన్న సిరిసిల్ల బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారని, డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, శిక్షణ కార్యక్రమానికి బిసి అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 08 వరకు డబ్లూడబ్ల్యూడబ్ల్యూ. టిజిస్టడీసర్కిల్.సిజిజి.జిఓవి.ఇన్‌లో ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు ఉండాలని, ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 040`29303130, 9381888746ను సంప్రదించాలని సూచించారు.

## సమాజానికి తిరిగి మనం సేవ చేయాలి

* **మండల విద్యాధికారి జె. జెమిని కుమారి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సమాజానికి తిరిగి మనం సేవ చేయాలని నెహ్రూ నగర్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ , మండల విద్యాధికారి జె. జెమిని కుమారి అన్నారు. సంఘ సేవకులు స్వర్గీయ డాక్టర్ భూషణ్ రావు జయంతి సందర్భంగా వారి సతీమణి నెహ్రూ నగర్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ , మండల విద్యాధికారి జె. జెమిని కుమారి , వారి కుమార్తెలు సందీప్తి, ఎలిజబెత్ వారి కుమారుడు అభిషెక్త్ లు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వారి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు. ఎగ్జామ్స్ పాడ్, ఎరేజర్, షార్పెనర్, రెండు పెన్నులు, హాల్ టికెట్ కవర్ తొంబై మంది విద్యార్థులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మనవసేవే మాధవ సేవ అని నమ్మిన భూషణ్ రావు ఆశయం మేరకు ఇలాంటి సేవ కార్యక్రమం చెప్పట్టామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కృషి చేస్తున్న హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తుటే విజయ్ కుమార్ , వారి బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏం ఎల్ ఓ రమేష్, సామాజిక వేత్త మధుబాబు చికిలే, కోశాధికారి మైసా దేవి, సభ్యులు సాజిత్, ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీశైలం, రాజామణి, నాగమణి ,జ్యోతి, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణ రాజపుత్ జన్మదిన వేడుకలు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణ రాజపుత్ జన్మదిన వేడుకలు బుధవారం కూకట్ పల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మీడియా కోఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు , కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, సంజీవ, మైకల్ ,నాగరాజు, ప్రకాష్, మొయిజుద్దీన్, నరసింహ, అరుణ్, బాలరాజు ,సుధా, రమా దేవి ,జోజమ్మ, భరతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి

* **టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి మంత్రి దామోదర్ హామీ**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) :రాష్ట్రంలో జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పథకాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు గాను త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి.దామోదర్ రాజ నరసింహ హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం అసెంబ్లీలోని ఛాంబర్ లో మంత్రి దామోదర్ రాజ నర్సింహాను కలిసి జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుపై చర్చించి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాక పోవడంతో జర్నలిస్టులు అనుభవిస్తున్న కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అసలే ఆర్థిక కష్టాలతో జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు, వైద్య ఖర్చులు మరింత భారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి జర్నలిస్టులు వైద్యం పొందే పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కురి రాములు, రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

## ప్రకృతి ఆరోగ్య మహాసభ కు హాజరుకావాలని ఎస్పీ కి ఆహ్వానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ఈ నెల 23వ తేదీన, కొత్తగూడెంలో జరిగే ప్రకృతి 'ఆరోగ్య మహాసభలకు' హాజరుకావాలని ఆరోగ్య మిత్రులు ఎస్పీ రోహిత్ రాజు ని కోరారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో, ఎస్పీ బి .రోహిత్ రాజు ని, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.23వ తేదీ, ఆదివారం ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో, ప్రకృతి ఆరోగ్య మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సభలలో శారీరక ఆరోగ్యం మానసిక ఆరోగ్యం సామాజిక ఆరోగ్యం, ల తో పాటు ప్రకృతి పర్యావరణ పరిరక్షణపై ప్రముఖ ప్రకృతి కవి డా. జి. జయరాజు, ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, డా. ప్రత్యూష సుబ్బారావు, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రమేష్ బాబు, జాతీయ జలసాధన సమితి అధ్యక్షుడు, నల్లగొండలో సహజ అడవి సృష్టికర్త, దుశర్ల సత్యనారాయణ లు పాల్గొని ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. మీరు కూడా ఈ సభలలో పాల్గొని సందేశం అందించాల్సిందిగా నిర్వాహకులు ఎస్పీ ని కోరారు. దీనికి ఎస్పీ స్పందిస్తూ.. అన్ని రకాల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందియమన్నారు. అవకాశం ఉన్న వారందరూ ఈ సభలకు హాజరై వివిధ రకాల ఆరోగ్యాలపై అవగాహనను పెంచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ని కలిసిన సభ వారిలో కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, కోఆర్డినేటర్ జి. సుగుణారావు, బంగారి శంకర్ లు ఉన్నారు.

## డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ లో విద్యార్థుల నమోదుకు చర్యలు చేపట్టాలి

: **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీ.ఈ.ఈ.టీ) లో విద్యార్థుల వివరాల నమోదుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో డీ.ఈ.ఈ.టి యాప్ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీ.ఈ.ఈ.టీ) ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, ఇందులో నమోదైతే విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల అర్హత ప్రకారం ప్రైవేట్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల వివరాలు తెలుస్తాయని, నిరుద్యోగులకు పరిశ్రమలకు వారధిగా ఇది పనిచేస్తుందని అన్నారు.ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర ఉపాధి కోర్సులు చదివిన విద్యార్థులు డీ.ఈ.ఈ.టి లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ & ప్రైవేటు రంగంలో ఉపాధి పొందే అవకాశాలు మెరుగు అవుతాయని అన్నారు.జిల్లాలో ఉన్న ఐటిఐ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాసైన విద్యార్థుల వివరాలను 15 రోజులలో డీ.ఈ.ఈ.టి లో నమోదయ్యే లా చూడాలని అన్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు , ఇతర ఉపాధి కోర్సుల కళాశాలలో, ఎంబీఏ కాలేజి విద్యార్థులు కూడా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రైవేట్ రంగంలోనే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే నోటిఫికేషన్ లో అర్హత కలిగిన ఉద్యోగాల వివరాలు కూడా విద్యార్థులకు చేరవేసేందుకు డీ.ఈ.ఈ.టీ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఏపీవో డేవిడ్ రాజు,, పరిశ్రమల శాఖ తిరుపతయ్య జనరల్ మేనేజర్, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, డిటిసిపిఓ సత్యనారాయణ, ఆర్టీఓ వెంకటరమణ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## బిజెపి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ కు సన్మానం

రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట మండల కేంద్రానికి చెందిన బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ ను బుధవారం పలువురు ఆయన నివాస గృహంలో పుష్పగుచ్చము శాలువాతో సత్కరించి అభినందించారు. ఏబీవీపీ మాజీ మండలాధ్యక్షులు గుజ్జుక వెంకటేష్, ఉపాధ్యక్షులు నారెడ్డి శేఖర్ రెడ్డి, నర్సాపురం గ్రామ శాఖ మాజీ బిజెపి అధ్యక్షులు బాల్ద సతీష్ తదితరులున్నారు.

## జిల్లా ఉత్తమ అంగన్వాడీ టీచర్ గిరెడ్డి పద్మకు అధనపు కలెక్టర్ చే సత్కారం



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజాపేట మండలం నమిల అంగన్వాడి టీచర్ గిరెడ్డి పద్మను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ అంగన్వాడి టీచర్ గా ఎంపిక చేయగా బుధవారం అదనపు జిల్లా కలెక్టర్ గంగాధర్ చేతుల మీదుగా సత్కారం పొందారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో గిరెడ్డి పద్మను శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, పిడి నరసింహారావు, సిడిపిఓ స్వరాజ్యం, సూపర్వైజర్ రమణ, తోటి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ ఎర్ర పోచమ్మ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయి నగర్ వెస్ట్ లోని శ్రీశ్రీశ్రీ ఎర్ర పోచమ్మ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాజేష్ చంద్ర, శ్రీనివాస్, సంతోష్ బిరాదర్, ఉమేష్, రామరాజు, రాము, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరు అందించడం పట్ల రైతులు ధన్యవాదాలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని పంట పొలాలకు సాగునీరు అందించినందుకు కృషి చేసిన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు, సహకరించిన అధికారులకు మండల రైతాంగం ధన్యవాదాలు తెలిపారు.. ముస్తాబాద్ మండలానికి మల్లన్న సాగర్ నుంచి సిద్దిపేట, నారాయణపేట, మీదుగా ఇబ్రహీంపూర్ చెరువు నింపుకొని అక్కడి నుండి నక్క వాగు చేరుకొని, నక్క వాగు నుంచి ముస్తాబాద్ మండలానికి సంబంధించిన గన్నెవాని పల్లె, సేవలాల్ తండా, పోతుగల్, తెర్లుమద్ది, గండి లచ్చపేట్, ఆవునూర్, తుర్కపల్లి వాగులోకి మల్లన్న సాగర్ నీరు చేరుకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**: ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలు నందు అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా గత నెలలో వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు , సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలని సూచించారు. అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన



పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు.పోక్సో కేసులలోని నిందితులకు త్వరితగతిన శిక్ష పడే విధంగా కృషిచేయాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణా,మట్కా,క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని అన్నారు. రాబోయే నెలలో జరగనున్న భద్రాచలం శ్రీరామనవమి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.షి టీమ్స్,భరోసా కేంద్రాల ఆవశ్యకత గురించి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి భాధిత మహిళలకు అండగా ఉండాలని తెలిపారు.ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ,డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఐటీ సెల్ సీఐ నాగరాజు రెడ్డి , ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## నీతీశ్‌తో వాగ్వాదం.. రబ్రీ దేవి వాకౌట్

పట్నా: బిహార్ శాసనమండలిలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, మాజీ సీఎం రబ్రీ దేవి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకొంది. నీతీశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఆమె ప్రతిపక్షాలతో కలిసి సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్జేడీ మిత్రపక్షమైన సీపీఐ(ఎమ్ఎల్) నేత ఎమ్మెల్సీ శశి యాదవ్ అడిగిన ఓ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పింది. దీనిపై స్పందించిన రబ్రీ దేవి ప్రభుత్వం ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదంటూ వ్యాఖ్యా నించారు. వెంటనే నీతీశ్ కుమార్ మాట్లాడుతూ.. ''మా ప్రభుత్వం రాష్ట్రం కోసం ఎంతో చేసింది. గతంలోని ప్రభుత్వం ఎలాంటి మేలు చేయలేదు'' అని ఆరోపించారు. రాష్ట్ర మహిళలకు ఇప్పుడున్నంత గౌరవం గత ప్రభుత్వాల హయాంలో లేదని అన్నారు. ''వారు మహిళల కోసం ఏం చేశారు..?తన భర్త సమస్యల్లో ఉన్నప్పుడు ఆమెను సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు'' అంటూ సీఎం వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై రబ్రీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ''నాడు ఎలాంటి పనులు జరగలేదని వ్యాఖ్యానించడం కాదు.. వాటి రికార్డులు సభకు చూపించగలరా..?'' అని ప్రశ్నించారు. అనంతరం సభ నుంచి ప్రతిపక్షాలతో కలిసి వాకౌట్ చేశారు.

## క్యూఎస్ ర్యాంకింగ్స్.. టాప్-50 వర్సిటీల జాబితాలో దిల్లీ, బాంబే ఐఐటీలకు చోటు



ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను వివిధ అంశాలవారీగా అంచనా వేసే క్యూఎస్ ర్యాంకులు విడుదలయ్యాయి. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఐఐటీ దిల్లీ, ఐఐటీ బాంబే టాప్ 50 జాబితాలో చోటుదక్కించుకున్నాయి. ఈసారి ఐఐటీ దిల్లీ 47వ ర్యాంకులో నిలవగా.. ఐఐటీ బాంబే 50వ స్థానంలో ఉంది. అయితే, గతేడాది ఐఐటీ దిల్లీ 45వ స్థానంలో ఉండటం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 550 యూనివర్సిటీలకు సంబంధించి రూపొందించిన ఈ ర్యాంకింగ్స్ జాబితాలో.. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) మరోసారి అంతర్జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ రెండు, యూనివర్సిటీ కాలిఫోర్నియా మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాయి. తొలి మూడు ర్యాంకులూ అమెరికాలోని వర్సిటీలే దక్కించుకోవడం విశేషం. క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో భారత్‌కు చెందిన పలు వర్సిటీలు సాధించిన ర్యాంకులను పరిశీలిస్తే.. ఐఐటీ దిల్లీ (47), ఐఐటీ బాంబే (50), ఐఐటీ ఖరగ్‌పుర్ (78), ఐఐటీ మద్రాస్ (84), ఐఐటీ కాన్పుర్ (92), ఐఐఎస్సీ బెంగళూరు (136) నిలిచాయి. అలాగే, 151 200 మధ్య ర్యాంకుల్లో అన్నా యూనివర్సిటీ చెన్నై, ఐఐటీ గువాహటి, ఐఐటీ రూర్కీ, వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిలవగా.. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్), పిలానీకి 251-300 మధ్య ర్యాంకుల్లో చోటు దక్కింది. 301-350 మధ్య ర్యాంకుల్లో చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్సిటీ, 401-450 మధ్య ర్యాంకుల్లో చండీగఢ్ యూనివర్సిటీ నిలిచింది.

## చొరబాటు యత్నాలు.. 2601 మంది బంగ్లాదేశీయులపై భారత్ చర్యలు!

భారత్‌లోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సరిహద్దులో భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన 2601 మంది బంగ్లాదేశీయులను భారత బలగాలు అరెస్టు చేసినట్లు 2024 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు.రాజ్యసభలో ఈమేరకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత్ బంగ్లా సరిహద్దు ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడానికి అధునాతన నిఘా, సాంకేతిక వ్యవస్థ,



సమగ్ర ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటివి వినియోగిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా నిరంతర పెట్రోలింగ్, చొరబాటుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్లు, సోలార్ లైట్లు ఏర్పాటు, నదీ ప్రాంతాల్లో నిరంతరం పడవలతో పహారా చేపడుతున్నామన్నారు. బీఎస్ఎఫ్ నేతృత్వంలోని 15 మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తున్నాయని వెల్లడించారు. గతేడాది ఆగస్టు 5న హసీనా ప్రభుత్వం పతనమైన అనంతరం తాజాగా ఇరు దేశాల భద్రతా బలగాల అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారుల మధ్య చర్చలు జరిగాయని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా భారత్‌బంగ్లా మధ్యనున్న 4,096 కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో కంచె లేని ప్రాంతాల్లో కంచె వేయడానికి అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు.

## ఎల్జీపై కేసులు.. వెనక్కి తీసుకునేందుకు దిల్లీ ప్రభుత్వం సిద్ధం




దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో కీలక పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. గతంలో లెఫ్టినెంట్ గవర్నర్.. దిల్లీ ప్రభుత్వం మధ్య పలు విషయాల్లో వివాదాల కారణంగా నమోదైన కేసులను ఉపసంహరించుకునేందుకు సీఎం రేఖా గుప్తా నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు సంబంధింత వర్గాలు వెల్లడించాయి. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్లు నజీబ్ జంగ్, అనిల్ బైజల్, వీకే సక్సేనా మధ్య కొన్ని అంశాలపై అభిప్రాయాలు కుదరలేదు. విభేదాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దిల్లీ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఛైర్మన్, దిల్లీ జల్ బోర్డు నిధులు, అల్లర్ల కేసులో న్యాయవాదుల నియామకం, విదేశాల్లో ఉపాధ్యాయ శిక్షణ, యమునా నది కాలుష్యంపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు ఇలా తదితర విషయాల్లో గవర్నర్లు, ప్రభుత్వం మధ్య వివాదాలు తలెత్తాయి. గవర్నర్ ప్రభుత్వ కార్యక్రమాలకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తున్నారంటూ నాడు సీఎంగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. వారికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేశారు. ఆతీశీ హయాంలోనూ ఇదే జరిగింది. ఆప్ ప్రభుత్వం తమకు సహకరించడం లేదంటూ గవర్నర్లు ఆరోపించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గవర్నర్లకు వ్యతిరేకంగా కేసులు నమోదయ్యాయి. వారికి వ్యతిరేకంగా ఉన్న కేసులు, న్యాయపరమైన చిక్కులను విప్పేందుకు భాజపా ప్రభుత్వం యోచిస్తోంది. కేసులను ఉపసంహరించేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

## 'నాకు 8 భాషలు వచ్చు..' త్రిభాషా సూత్రానికి ఎంపీ సుధామూర్తి మద్దతు

దిల్లీ: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడుకేంద్ర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనూ దీనిపై ఎంపీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ, ప్రముఖ వితరణశీలి సుధామూర్తి దీనిపై మాట్లాడుతూ..త్రిభాషా సూత్రానికి మద్దతు పలికారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం పిల్లలకే మంచిదన్నారు. ''ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలని సూచిస్తాను. నాకు 7-8 భాషలు వచ్చు. నేర్చుకోవడాన్ని నేను చాలా ఇష్టపడతా. పిల్లలు కూడా దీని వల్ల మంచి ప్రయోజనాలు పొందుతారు'' అని సుధామూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందీ వివాదం వేళ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. త్రిభాషా సూత్రం అమలుపై ప్రతిపక్షాలు, ముఖ్యంగా డీఎంకే పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం దీనిపై మాట్లాడుతూ.. ''ద్విభాషా పద్ధతిపై తమిళనాడు చాలా స్పష్టంగా ఉంది. ప్రపంచ శాస్త్ర, సాంకేతికత, వాణిజ్య విధానాలతో అనుసంధానం కోసం ఆంగ్లం నేర్చుకోవాలి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం కోసం తమిళం ఉండాలి. ఒకవేళ మూడో భాషను నేర్చుకోవాలంటే అది విద్యార్థుల అభీష్టానికి వదిలేయాలి. అంతేగానీ.. తప్పనిసరి అంటూ బలవంతంగా రుద్దకూడదు. కేంద్రం చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం'' అని అన్నారు. అయితే, ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర



విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండి పడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# ప్రతిపక్షాల విమర్శలను దీటుగా ఎదుర్కోవాలి : సీఎల్పీ భేటీలో సీఎం

హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలకు అందరు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయని, సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. సభలో వ్యవహరించాల్సిన విధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని, అత్యంత కీలకమైనవిగా సీఎం స్పష్టం చేశారు. ఈ 15నెలల్లో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై



పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశం ఉందన్నారు. సభ్యులందరూ కచ్చితంగా రావాల్సిందేనని, ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలన్నారు. సమావేశాల్లో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. సభ్యుల హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు. సీఎల్పీ భేటీలో మాట్లాడుతుండగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌పై సీఎం అసహనం వ్యక్తం చేశారు.

## నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష భేటీ

**: డిప్యూటీ సీఎం భట్టి**

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన పై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భట్టి విక్రమార్క రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ రాశారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో



పేర్కొన్నారు. "జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు ప్రమాదం. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలి. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. త్వరలోనే భేటీకి సంబంధించిన తేదీ, వేదిక ప్రకటిస్తాం" అని లేఖలో పేర్కొన్నారు.

## హైడ్రాకు ఫిర్యాదుల వెల్లువ.. పెండింగ్‌లో 10వేలకు పైగా పిటిషన్లు

హైదరాబాద్: ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి హైడ్రా చేస్తున్న కృషిని కమిషనర్ రంగనాథ్ వివరించారు. ఒకప్పటి చెరువుల పరిస్థితి, ఇప్పటి పట్టణీకరణ, హైడ్రా చేస్తున్న పనులపై బుధవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజావాణికి నేరుగా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతోందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఫిర్యాదుల పరిష్కారం కోసం కృషి చేస్తున్నా.. ఇంకా 10వేలకు పైగా పిటిషన్లు పెండింగ్‌లో



ఉన్నాయన్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కా రానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

## సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఇద్దరు యూట్యూబర్‌లు అరెస్ట్

హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వప్రసాద్ మీడియాకు వెల్లడించారు. "నిప్పు కోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో సీఎంను తిడుతున్న వీడియో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశ పూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించాం. పల్స్ టీవీలో వచ్చిన




ఈ వీడియోను 'నిప్పుకోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. కేసు దర్యాప్తు చేసి ఆ టీవీ ఛానెల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను అరెస్ట్ చేశాం. టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి రెండు ల్యాప్ టాప్‌లు, రెండు హార్డ్ డిస్క్‌లు, ఒక లోగో, ఒక రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నాం. రేవతిపై గతంలో బంజారాహిల్స్, ఎల్‌బీనగర్‌లో కేసులు ఉన్నాయి" అని అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.



## 19న తెలంగాణ బడ్జెట్.. 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్: ఈ నెల 19న తెలంగాణ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈమేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉండనుంది. 14న హోలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 17, 18 తేదీల్లో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నెల 27 వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 21 నుంచి 26 వరకు పద్దులపై చర్చ ఉండనుంది.



## గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు: కేటీఆర్

హైదరాబాద్: అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్‌లా ఉందని భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. "గవర్నర్ ప్రసంగంలో కొత్త విషయాలు చెబుతారనుకున్నాం. రైతులకు భరోసా ఇస్తారని భావించాం. 20 నుంచి 30 శాతానికి మించి రైతులకు రుణమాఫీ జరగలేదు. కానీ.. పూర్తిగా చేసినట్లు గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు. ఈ ప్రసంగంతో ఆయన స్థాయిని తగ్గించారు. సీఎం రేవంత్ చేతకానితనం వల్ల అనేక ఎకరాలకు నీరు అందడం లేదు. 20 శాతం కమీషన్ తప్ప.. విజన్ లేని ప్రభుత్వమిది. సాగునీటి సంక్షోభం, రైతుల ఆత్మహత్యలపై గవర్నర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కాంగ్రెస్ చేసిన అప్పుల గురించి ప్రస్తావన లేదు. దిల్లీకి మూటలు పంపేందుకే ఈ ప్రభుత్వం ఉంది" అని కేటీఆర్ విమర్శించారు.

## తెలంగాణ రాష్ట్రానికి రైతులే ఆత్మ.. వారి అభివృద్ధికి కృషి : గవర్నర్

హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగించారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ ప్రవేశపెడుతోందన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని పేర్కొన్నారు. "మా ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉంది. అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం. రైతులు, మహిళలు, యువతకు అన్నివిధాలా సహకారం అందిస్తాం. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నాం. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నాం. అభివృద్ధి, ప్రగతి వైపు తెలంగాణ అడుగులు వేస్తోంది. రాష్ట్రానికి రైతులే ఆత్మ.. వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు. రాష్ట్ర అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉంది. దేశంలో అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ. అన్నదాతలకు రుణమాఫీ చేశాం.. ఇదే మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. 23.35 లక్షల మంది కర్షకు లకు ప్రయోజనం కల్పించాం. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున వారికి అందిస్తున్నాం. రైతు నేస్తం అమలు చేస్తున్నాం. వరి పంటకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నాం. అన్నదాతల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశాం. మహాలక్ష్మి పథకం గేమ్‌ఛేంజర్‌గా మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మహిళలకు 149.63 కోట్ల ఉచిత బస్సు ట్రిప్పులను కల్పించాం. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.5005.95 కోట్లు ఆదా అయింది. ఇందిరా మహిళాశక్తి మిషన్ పాలసీ ద్వారా రూ.లక్ష కోట్ల ఆర్థిక సహాయం చేయడమే లక్ష్యం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది.

## 47నిమిషాల్లో 3.23 కి.మీ.నడక.. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన రెండేళ్ల చిన్నారి

నిండా రెండేళ్లు కూడా నిండని ఆ బుడతడి బుడిబుడి అడుగులకు అవార్డులు తలవంచాయి. అతి చిన్నవయసులో 47 నిమిషాల్లో ఏకంగా 3.23 కిలోమీటర్ల దూరం నడిచి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌ను సొంతం చేసుకున్నాడు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువుకు చెందిన అపురూప, సత్యనారాయణల కుమారుడు రుద్రాన్ష్.. తన తాత నరేంద్ర రెడ్డి ప్రోత్సాహంతో ప్రతిభను చాటుకున్నాడు. రానున్న రోజుల్లో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను కూడా కైవసం చేసుకునేలా తయారు చేస్తామని రుద్రాన్ష్ కుటుంబ సభ్యులు తెలిపారు.





'అలల ఊపులో తీయని తలపులు చెలరేగుతాయ'ని అన్నాడో సినీకవి. ఇలాంటి వలపులు ఎక్కడపడితే అక్కడ సుడి తిరగవు. కొలునులో నీరు నిద్దురోయినట్టే ఉండాలి. కొత్త పెండ్లి కూతురు కుదురుగా కూర్చోవడానికి గూటి పడవ కావాలి. మంచు కౌగిట చిక్కుకున్న గిరులు.. లీలగా కదలాడే ఏటి నీటిపై వణుకుతున్నట్టు కనిపించాలి!

# హిమగిరి కౌగిట రుచుల వేడుక

**టేస్టీ ఇండియా**

'అలల ఊపులో తీయని తలపులు చెలరేగుతాయ'ని అన్నాడో సినీకవి. ఇలాంటి వలపులు ఎక్కడపడితే అక్కడ సుడి తిరగవు. కొలునులో నీరు నిద్దురోయినట్టే ఉండాలి. కొత్త పెండ్లి కూతురు కుదురుగా కూర్చోవడానికి గూటి పడవ కావాలి. మంచు కౌగిట చిక్కుకున్న గిరులు.. లీలగా కదలాడే ఏటి నీటిపై వణుకుతున్నట్టు కనిపించాలి! ఇవన్నీ ఉన్నాయంటే అది తప్పకుండా దాల్ సరస్సు అయి తీరుతుంది. ముక్కుపచ్చలారని కశ్మీరంలో.. ముచ్చటైన ప్రాంతం శ్రీనగర్. హనీమూన్ స్పాట్‌గా పేరున్న ఈ హిమగిరి నగరి వెరైటీ రుచులకు ట్రెజరీ కూడా! ఎందుకు ఆలస్యం శ్రీనగర్ పాకశాలలో పాగా వేసేద్దాం..

శ్రీ నగర్‌లో దిగగానే.. అరచేతులు రెండూ ఆల్చిప్పల్లా అతుక్కుపోతాయి. హిమగిరుల్ని ముద్దాడిన మలయ మారుతం పర్యాటకుల్ని చుట్టేసి మారాం చేస్తుంటుంది. నెచ్చెలి చెంతనున్నా.. మధ్యలో దూరిపోయిన చలిని తట్టుకోవడానికి అరచేతులను అదేపనిగా రుద్దేసుకుంటారు. ఎంత రాపిడి చేసినా ప్రయోజనం ఉండదు. ఆ రెండు చేతులతో చాయ్ జాయ్ కేఫ్ టీ కప్పు అందుకుంటే చాలు.. చలి పారిపోతుంది. అలా ఉష్ణోదక సేవనంతో శ్రీనగర్ విహారం వెచ్చగా మొదలవుతుందన్నమాట.

ప్రయాణ బడలిక తీర్చుకొని శ్రీనగర్ వీధుల్లో తిరగడం మొదలుపెడితే.. అడుగుకో రుచి పలకరించి కాస్త ఆగమంటుంది, రుచి చూసి కదలమంటుంది. కొత్త జంటల్లోనే కాదు.. సిల్వర్ జూబ్లీ దంపతుల్లోనూ శ్రీనగర్ సిత్రాలు చిలిపి కోరికలు పుట్టిస్తాయి. ఆ వాంఛలు కంచె దాటాలంటే.. కాస్త మసాలా పుడ్డు పడాల్సిందే! కశ్మీరీ పాకం రోగన్ జోష్‌తో జోష్ వస్తుంది. హిమగిరి గొర్రె మాంసంతో తయారయ్యే ఈ కర్రీలో ఫ్యాట్ తక్కువ. సత్వరం శక్తి వస్తుంది. ఓన్లీ కర్రీ లాగిస్తే మజా ఏం ఉంటుంది? దానికి జతగా రెండు రొట్టెలు తిని ఊరుకోవద్దు.

ఆ తర్వాత మరో కశ్మీరీ వెరైటీ మధుర్ పులావ్ ఆబగా తినేయాలి. పెరుగు, నెయ్యి పట్టించి, కుంకుమ పువ్వు, జీడిపప్పు, బాదం దట్టించి చేసే ఈ వంటకం టేస్ట్ చేయగానే అద్భుతః అనిపిస్తుంది. ఈ వింత వంటకాలు రుచి చూశాక ఏ వంకో వెళ్లి నాలుగు అడుగులు వేయకపోతే... నిద్రాదేవి ఆవహించి కాగల కార్యాన్ని భగ్నపరచొచ్చు. అలా కావొద్దంటే.. షాలిమార్ తోటలో జంటగా వాహ్యాళి చేస్తే సరి! చుట్టూ ఉన్న ప్రకృతిని ఆస్వాదిస్తూ నాలుగు అడుగులు వేయగానే.. గ్లూకోజ్ అంతా కరిగిపోయి ఫ్రక్టోజ్‌గా మారిపోయి శక్తిమంతులు అవుతారు. ఆ పూట విహారానికి సెలవిచ్చేస్తారు.

పొద్దంతా దూదికొండలా తెల్లగా మెరిసిపోయే శ్రీనగర్.. సాయం సంధ్యలో మరింత మాయ చేసేలా ఎర్రగా కందిపోతుంది. ఆ వేళ దాల్ సరస్సుకేగి గూటి పడవలో జొరబడితే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది. హౌస్‌బోట్లు కూడా ఉంటాయి. అందులో రెస్టారెంట్లూ ఉంటాయి. వెయిటర్‌కు లేట్ చేయకుండా 'కశ్మీరీ మాస్తచంగద్' తెచ్చివ్వమని ఆర్డరివ్వండి. ఈ మటన్ వెరైటీ టేస్ట్ చేయగానే నాలికపై ఉన్న రుచి కళికలు పునరుత్తేజం పొందుతాయి. నాన్‌వెజ్ ఏం తింటాం లే అనుకుంటే.. స్పైసీ దమ్ ఆలూ తెప్పించుకుంటే సరి!

దాల్ సరస్సులో ఓలలాడిన తర్వాత కలిగిన ఆనందాన్ని రెట్టింపు చేసే విహార కేంద్రం తులిప్ తోట. కొత్తకొత్తగా పూసిన తులిప్ పూలు స్వర్గమిక్కడే అంటాయి. ఉద్యానవనంలో జంటగా ఊరేగిన తర్వాత.. అలా వీధుల్లోకి వస్తే రకరకాల ఘుమఘుమలు సాదర స్వాగతం పలుకుతాయి. మసాలా టోస్ట్ టేస్ట్ చేసిన తర్వాత.. టిబెటన్ చాయ్ తాగితే సాయంకాలం కాస్త స్లిమ్‌గా మండే జఠరాగ్నికి సాయం చేసినవాళ్లమవుతాం. అప్పటికైతే... ఇప్పటికి తిన్నది చాలు అనుకుంటాం! కానీ, ఇంకో పది అడుగులు వేశామో లేదో.. హల్వా పరాఠా గోముగా మన వంక చూస్తుంది.

రవ్వ కేసరితో జట్టుకట్టిన పరాఠా మరో పోరాటానికి దారితీస్తుంది. మిఠాయితో తీపిపడ్డ జిహ్వాకు హార్ట్ టచింగ్‌లా హాట్ వెరైటీలు ఎన్నో అక్కడి వీధుల్లో కనిపిస్తాయి. ఒక్కోటీ రుచి చూస్తూ వెళ్లడమే! ఇవేనా.. కశ్మీరీ బిర్యానీ, గుష్తబా చికెన్ కర్రీ, పనీర్ వెరైటీ ల్యోదుర్ త్సాచమన్, కశ్మీరీ మోమోస్, లేహ్ వెరైటీ తెన్‌థుక్ నూడుల్స్ సూప్ ఇలా రకరకాల వెరైటీలు అందుబాటులో ఉంటాయి. ఎంత తిన్నా వీధులన్నీ చుట్టొచ్చే సరికి ఇట్టే కరిగిపోతుంది. కాబట్టి, నోటికి తాళం వేయకండి. కశ్మీరీ రుచులకు వంతపాడండి. ఆత్మారాముడికి విందు చేయండి.













## ఆనంద బాలాసనం!

**దీనికే హ్యాపీ బేబీ పోజ్ అని పేరు. శారీరక, మానసిక ఒత్తిడి తగ్గించేందుకు సాయపడుతుంది. సంతోషంగా ఉన్న బిడ్డ ఎలాంటి ఒత్తిడీ లేకుండా నేలపై పడుకుని కేరింతలు కొడుతుంది కదా! అలాగే ఉంటుందీ ఆసనం.**

యోగా మ్యాట్ పైన వెల్లకిలా విశ్రాంతిగా పడుకోండి. నెమ్మదిగా గాలి పీల్చుకుంటూ రెండు కాళ్లూ పైకెత్తి మోకాళ్లను ఛాతీ వైపు తీసుకురండి. ఎలాంటి ఒత్తిడీ లేకుండా చేతులను పాదాలవైపు తీసుకెళ్లి సాధ్యమైతే కాలివేళ్లను పట్టుకునేందుకు ప్రయత్నించండి. మోకాళ్లను భుజాలవైపు వచ్చేలా సాధ్యమైనంతగా స్ట్రెచ్ చేయండి. ఇలా 20-30 సెకన్లపాటు ఉండండి. తర్వాత యథాస్థానానికి వచ్చి శవాసనంలో విశ్రాంతి తీసుకోండి. నొప్పిగా అనిపించనంతవరకూ సుమారు 10-15 నిమిషాలు చేయాలి. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేస్తుంది. మానసిక అలసట నుంచి ఉపశమనం ఉంటుంది. తుంటి, వెన్ను కండరాలను ఉత్తేజితం చేస్తుంది. ఉదర కండరాలను బలపరుస్తుంది.



# పోసానికి 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి



గుంటూరు: సినీనటుడు, వైకాపా నేత పోసాని కృష్ణ మురళిని పోలీసులు గుంటూరులోని జడ్జి ఎదుట హాజరుపర్చారు. ఈ క్రమంలో పోసాని.. బోరున విలపించారు. తన ఆరోగ్యం బాగాలేదని, రెండు సార్లు ఆపరేషన్ చేసి స్టంట్లు వేశారని కంటతడి పెట్టాడు. బెయిల్ రాకుంటే ఆత్మహత్యే శరణ్యమని జడ్జి ఎదుట వాపోయాడు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయమూర్తి.. పోసానికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోసానిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను కొట్టివేయాలని పోసాని దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మరోవైపు కర్నూలు జిల్లా ఆదోనిలో నమోదైన కేసులో పోసానికి మంగళవారం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో పీటీ వారెంట్‌పై గుంటూరుకు తీసుకొచ్చిన అధికారులు సీఐడీ కోర్టులో హాజరుపర్చారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం.. ప్రభుత్వ పరిశీలనలో ఉంది : అనగాని



అమరావతి: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపై ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రశ్నలు లేవనెత్తారు. కొణతాల రామకృష్ణ, కాలవ శ్రీనివాసులు ప్రశ్నలు అడిగారు. వీరికి మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానాలిచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. రేషన్‌కార్డు ఉన్న చోటే స్థలం ఇచ్చే అంశం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాల కేటాయింపుపై క్యాబినెట్ సబ్ కమిటీ అధ్యయనం చేస్తోందని పేర్కొన్నారు. కమిటీ ఈ అంశంపై ప్రతిపాదనలు చేస్తోందన్నారు. "జర్నలిస్టులకు తక్కువ ధరకే స్థలాలు ఇవ్వడం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. వీటిని ఎలా ఇవ్వాలనే అంశంపై సీఎం ఆదేశాలతో కసరత్తు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇస్తామంటూ జర్నలిస్టులను కూడా మోసం చేసింది. వారిపై భారం మోపేలా ఇళ్ల పట్టాల జీవోను ఇచ్చింది" అని అనగాని సత్యప్రసాద్ అన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల నిర్వాకం..
# 8గంటల పాటు ఇబ్బంది పడ్డ కూలీలు



గుంటూరు: కోటక్ మహీంద్రా బ్యాంకు ఉద్యోగుల నిర్వాకం వల్ల ఇద్దరు కూలీలు దాదాపు 8గంటల పాటు తాగునీరు, ఆహారం లేక ఇబ్బంది పడ్డారు. ఏటుకూరు బైపాస్‌లోని సింహపురి ఎస్టేట్‌లో ఉన్న ఓ గోడౌన్ యజమాని రుణం చెల్లించలేదని బ్యాంకు అధికారులు బుధవారం మధ్యాహ్నం గోడౌన్‌కు సీల్ వేశారు. సిబ్బంది సీజ్ చేసే సమయంలో ఆ గోడౌన్‌లో ఇద్దరు బిహార్ కూలీలు పనిచేస్తున్నప్పటికీ.. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి తాళాలు వేసి సీల్ వేశారు. దీంతో ఇద్దరు కూలీలు మధ్యాహ్నం నుంచి లోపలే ఉండిపోయారు. గోడౌన్ లోపలి నుంచి అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోడౌన్ వద్దకు చేరుకున్న లాలాపేట పోలీసులు.. బ్యాంకు సిబ్బందిని పిలిపించి సీల్ తీయించారు. గోడౌన్ యజమాని తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో.. ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారికి సమాచారం ఇవ్వకుండానే బ్యాంకు అధికారులు సీల్ వేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు.

## సీఐడీ విచారణకు
# హాజరైన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



అమరావతి: ఏపీ సీఐడీ విచారణకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి హాజరయ్యారు. కాకినాడ పోర్టు అక్రమాల కేసులో ఆయన సీఐడీ కార్యాలయానికి వెళ్లారు. ఇదే కేసులో ఇప్పటికే విజయసాయిరెడ్డి ఈడీ విచారణకు హాజరయ్యారు. జగన్ హయాంలో కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ (కేఎస్‌పీఎల్), కాకినాడ సెజ్ (కేసెజ్)ల్లో రూ.3,600 కోట్ల విలువైన వాటాలను వాటి యజమాని కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీరావు)నుంచి బలవంతంగా లాగేసుకున్న కేసులో వైకాపా మాజీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఏపీ సీఐడీ ఇటీవల నోటీసులిచ్చింది. బుధవారం ఉదయం విజయవాడ సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో విజయసాయిరెడ్డి రెండో నిందితుడు(ఏ2) కాగా, జగన్ బాబాయ్ వై.వి.సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి ఏ1గా ఉన్నారు. కేఎస్‌పీఎల్, కేసెజ్‌ల్లో వాటాలు లాగేసుకున్న వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తించిన ఈడీ.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అభియోగాలు మోపి కేసు నమోదు చేసింది. రెండు నెలల కిందట సాయిరెడ్డిని ఈడీ విచారించింది. ఇదే వ్యవహారంలో సీఐడీ నోటీసులు ఇవ్వడంతో విజయసాయిరెడ్డి హాజరయ్యారు.

## వర్రా రవీందర్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్



జగ్గయ్యపేట: వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డికి జగ్గయ్యపేట కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కడప కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న రవీందర్‌రెడ్డిని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పోలీసులు పీటీ వారెంట్ పై మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన రవీందర్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై అసభ్యకర పోస్టులు పెట్టారనే ఫిర్యాదుల మేరకు అతనిపై పలు కేసులు నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా షేర్‌మహమ్మద్‌పేటకు చెందిన ఎనికె గోపి ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీసులు వర్రాపై ఐటీ యాక్ట్ ప్రకారం వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఈ కేసులో భాగంగా చిల్లకల్లు పోలీసులు కడప జైలుకు వెళ్లి అదుపులోకి తీసు కున్నారు. ముందుగా కడప జైలు అధికారులు వర్రాకు వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం జగ్గయ్యపేట పోలీసులకు అప్పగించారు. బుధవారం ఆయన్ను జగ్గయ్యపేట కోర్టులో ప్రవేశ పెట్టగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం జగ్గయ్యపేట సబ్‌జైలుకు ఆయన్ను తరలించారు.

## ఐదు వేర్వేరు ప్రాంతాల్లో..
# 200 మందిని బంధించిన వేర్పాటువాదులు..!



పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటనలో బలోచ్ వేర్పాటువాదుల చెర నుంచి దాదాపు 190 మంది ప్రయాణికులను భద్రతాబలగాలు రక్షించాయి. అలాగే 30 మంది మిలిటెంట్లను మట్టుపెట్టాయని స్థానిక వార్తాసంస్థలు పేర్కొన్నాయి. అయితే మిలిటెంట్లు ఐదు వేర్వేరు ప్రాంతాల్లో 200 మందిని బంధించినట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వతప్రాంతమైన క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ వెళ్తున్న సమయంలో ఈ హైజాక్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రైల్లోని తొమ్మిది బోగీల్లో 400 మంది ప్రయాణికులున్నారు. అలాగే రైల్లో ఉన్న బలోచ్ మిలిటెంట్లు చిన్న బృందాలుగా విడిపోయి ఉండటంతో.. ఆపరేషన్ కష్టతరంగా మారినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచ్ తిరుగుబాటుదారులు అఫ్గానిస్థాన్‌లోని తమ కీలక నేతతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. హైజాక్‌లో మొత్తం 70 నుంచి 80 మంది వేర్పాటువాదులు పాల్గొన్నారంటూ మీడియాతో మాట్లాడారు. ఈ ఘటన నేపథ్యంలో బలోచిస్థాన్‌కు రాకపోకలు సాగించే అన్ని రైళ్లను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. సైన్యం కిడ్నాప్ చేసిన రాజకీయ ఖైదీలు, ఉద్యమకారులు, అదృశ్యమైన వ్యక్తులను 48 గంటల్లోగా విడిచిపెట్టాలని బలోచ్ లిబరేషన్ ఆర్మీ డిమాండ్ చేస్తోంది. లేకపోతే తమ బందీలుగా ఉన్నవారిని చంపేస్తామని బెదిరిస్తోంది. అంతేకాదు.. రైలును కూడా ధ్వంసం చేస్తామని చెబుతోంది.

## వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పోలీసుల నోటీసులు



ఒంగోలు: వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి యర్రగొండపాలెం పోలీసులు 41 ఏ నోటీసులు జారీ చేశారు. ఆర్పోపై దురుసుగా ప్రవర్తించిన కేసులో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఒంగోలు వైకాపా కార్యాలయంలో ఎస్సై చౌదయ్య నోటీసులిచ్చారు. విచారణకు వచ్చి సహకరించాలని అందులో పేర్కొన్నారు.

# అత్యాధునిక సూపర్ రఫేల్ ఆవిష్కరణకు ఫ్రాన్స్ ప్లాన్..!



ఫ్రాన్స్ అత్యాధునిక ఫైటర్ జెట్ ఆవిష్కరణకు రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం వాడుతున్న రఫేల్ విమానాల్లో అత్యంత శక్తిమంతమైన వెర్షన్ ఎఫ్5ను తీసుకురావాలని భావిస్తోంది. దీనిని సూపర్ రఫేల్ అని కూడా వ్యవహరిస్తారు. గగనతల యుద్ధాన్ని ఇది పూర్తిగా మార్చేస్తుందని ఆ దేశం చెబుతోంది. ఆ విమాన నిర్మాణ సంస్థ డసో సీఈవో ఎరిక్ ట్రాప్పియర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. రానున్న నెలల్లో ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి ఈ విమాన నిర్మాణ కాంట్రాక్టు లభించవచ్చని వెల్లడించారు. 2030 నాటికి ఈ జెట్ ఫ్రాన్స్ వాయుసేనలో చేరనుంది. ఈ విమానాలు స్క్రామ్‌జెట్ హైపర్‌సోనిక్ క్షిపణులను తీసుకెళ్లేట్లు డిజైన్ చేయనున్నారని సమాచారం. న్యూక్లియర్ మిషన్లలో కూడా పాల్గొనేలా అత్యాధునిక కమ్యూనికేషన్లు, రాడార్లు, సెన్సర్లు దీనికి అమర్చనున్నారు. గతేడాది అక్టోబర్‌లో ఎఫ్5 వేరియంట్‌పై పనిమొదలు పెట్టినట్లు ఫ్రాన్స్ రక్షణ మంత్రి ప్రకటించారు. భారత్ కూడా ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలను వాయుసేనలో వినియోగిస్తోంది. ఇక నేవీ కోసం 26 యుద్ధ విమానాల కొనుగోలుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ కాంట్రాక్టుపై త్వరలోనే సంతకాలు జరగొచ్చని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి ఇటీవల ఆశాభావం వ్యక్తం చేశారు.

## మా నుంచి మారిషస్‌కు గిఫ్ట్ ఇదే : ప్రధాని మోదీ

పోర్ట్ లూయిస్: మారిషస్ తమకు కీలక భాగస్వామి అని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అలాగే 140 కోట్ల మంది భారతీయుల తరఫున మారిషస్ ప్రజలకు నేషనల్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. "నేషనల్ డే రోజున మరోసారి మీముందు ఉండటం నా అదృష్టం. మన రెండు దేశాలను అనుసంధానించేది హిందూ మహాసముద్రం మాత్రమే కాదు. సంస్కృతి, సంప్రదాయాలు మనల్ని కలిపి ఉంచుతున్నాయి. ఈ రెండు దేశాల బంధాన్ని 'మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్య' హోదాకు తీసుకెళ్లాలని ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, నేను నిర్ణయించాం. మారిషస్‌లో కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి భారత్ సహకరించనుంది. ప్రజాస్వామ్యానికి తల్లి వంటి భారత్ నుంచి మారిషస్‌కు ఇదొక కానుకగా భావిస్తున్నాం" అని మోదీ అన్నారు. "పది సంవత్సరాల క్రితం 'సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్'కు మారిషస్ నుంచే పునాది వేశాం. ఈ ప్రాంత శ్రేయస్సు, స్థిరత్వం కోసం సాగర్ విజన్‌తో ముందుకెళ్తున్నాం. గ్లోబల్ సౌత్ దేశాల కోసం మహాసాగర్ (MAHASAGAR)(Mutual and Holistic Advancement for Security and Growth Across Regions) విజన్‌ను ప్రకటిస్తున్నాం.




# రవి తేజ మాస్ జాతర

మాస్ మహరాజా రవితేజ విక్రమార్కుడులాంటి మరో సినిమా చేస్తున్నాడు. టాలీవుడ్ లో మోస్ట్ ఎనర్జిటిక్ సీనియర్ హీరోస్ లో రవితేజ కూడా ఒకరు. ఆయన హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే మాస్ జాతర. ఆ మధ్య వచ్చిన గ్లింప్స్ తో సాలిడ్ హైప్ ని ఈ సినిమా అందుకుంది. మరి ఈ సినిమాలో రవితేజ లుక్ కూడా రివీల్ అయ్యింది. అయితే లేటెస్ట్ గా ఇంకొన్ని ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ వింటేజ్ విక్రమార్కుడులో రవితేజ గుర్తు రాక మానడు. ఆ మీసకట్టు హెయిర్ స్టైల్ మళ్లీ పాత రవితేజని గుర్తు చేస్తున్నాయి. దీనితో మాస్ మహరాజ్ ఫ్యాన్స్ కి మాస్ జాతరలో క్రేజీ ట్రీట్ ఉండబోతుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మిస్తున్నాయి.

## మోహన్‌బాబుతో మాకెలాంటి ఆస్తి గొడవలు లేవు: సౌందర్య భర్త





సీనియర్ నటుడు మోహన్‌బాబుతో తమకెలాంటి ఆస్తిగొడవలు లేవని దివంగత నటి సౌందర్య భర్త రఘు అన్నారు. సౌందర్య మరణం ప్రమాదవశాత్తూ జరిగింది కాదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా మోహన్‌బాబు పేరు ఉపయోగిస్తూ పోస్టులు దర్శనమిచ్చాయి. దీంతో ఆయనకు మద్దతుగా సౌందర్య భర్త రఘు బహిరంగ లేఖ విడుదల చేశారు. ‘‘హైదరాబాద్‌లోని సౌందర్య ఆస్తికి సంబంధించి కొన్ని రోజులుగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఆమె ఆస్తిని నటుడు మోహన్‌బాబు ఆక్రమించుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నా. ఆయనతో సౌందర్య ఎలాంటి భూ లావాదేవీలు జరపలేదు. వారి కుటుంబంతో మాకు 25 ఏళ్లుగా మంచి అనుబంధం ఉంది. నేను మోహన్‌బాబును ఎంతో గౌరవిస్తా. మేమంతా ఒకే కుటుంబంగా ఉంటాం. మాకెలాంటి ఆస్తి గొడవలు, లావాదేవీలు లేవు’’ అని పేర్కొన్నారు.

# సినిమా

## ‘దేవ్‌దాస్’.. మా సినిమా వల్ల పెళ్లిళ్లు వాయిదా పడ్డాయట..!



బాలీవుడ్‌లో తెరకెక్కిన క్లాసిక్ చిత్రాల్లో ‘దేవ్‌దాస్’ ఒకటి. షారుక్ ఖాన్, ఐశ్వర్యా రాయ్, మాధురీ దీక్షిత్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వం వహించారు. 2002లో విడుదలైన ఈ సినిమా ఆరోజుల్లోనే రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని సినిమాటోగ్రాఫర్ వినోద్ ప్రధాన్ తాజాగా మీడియాతో పంచుకున్నారు. 2001లో ఈ సినిమా షూట్ జరిగినప్పుడు ఓ కారణం వల్ల చాలా మంది పెళ్లిళ్లు వాయిదా వేసుకున్నారని అప్పట్లో ప్రచారం జరిగిందంటూ ఆనాటి రోజులు గుర్తు చేసుకున్నారు. ‘‘ఆ రోజుల్లోనే భారీ బడ్జెట్‌తో రూపొందిన చిత్రమిది. ఈ సినిమా చిత్రీకరణ విషయంలో సంజయ్ లీలా భన్సాలీ ఎక్కడా రాజీ పడలేదు. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు సంబంధించి చంద్రముఖి (మాధురీ దీక్షిత్ పాత్ర పేరు) కోటలో దాదాపు కిలోమీటరు మేర భారీ సెట్ వేశారు. సెట్‌లోకి తొలిసారి అడుగుపెట్టిన నేను ఆశ్చర్యపోయా. ఇంత పెద్ద సెట్ ఎలా నిర్మించారా? అనిపించింది. సెట్ మొత్తం కాంతులీనేలా 2500లకు పైగా భారీ లైట్స్ ఏర్పాటు చేశాం. వాటి కోసం ఎక్కువ మొత్తంలో జనరేటర్స్ పెట్టాం. నగరంలో ఉన్న జనరేటర్స్ అన్నీ మా సెట్‌లోనే ఉన్నాయని అందరూ సరదాగా అనేవారు. జనరేటర్స్ అందుబాటులో లేకపోవడంతో ఆ సమయంలో చాలామంది తమ పెళ్లిళ్లు కూడా వాయిదా వేసుకున్నారని అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది’’ అని వినోద్ తెలిపారు. శరత్ చంద్ర ఛటోపాధ్యాయ రచించిన ‘దేవ్‌దాస్’ నవలను ఆధారంగా చేసుకుని ఈ సినిమా రూపొందింది. షారుక్ ఖాన్, ఐశ్వర్యా రాయ్ ప్రేమికులుగా నటించారు.

# నూడుల్స్ తిని బతికాం



‘రెహ్నా హై తేరే దిల్ మే’ మూవీతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ దియా మీర్జా. అనంతరం వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించింది. ఇక 2021లో విడుదలైన ‘వైల్డ్ డాగ్’ తెలుగు చిత్రంలోనూ ఈభామ నటించింది. ఓవైపు హీరోయిన్‌గా, మోడల్‌గా, సమాజ సేవకురాలిగా మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఈముద్దుగుమ్మకు 2012లో ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిలిం అకాడమీ ‘గ్రీన్ అవార్డు’ వచ్చింది. అయితే తాజాగా తన లైఫ్ జర్నీపై దియా ఆసక్తికరవిషయాలను ప్రేక్షకులతో పంచుకుంది. మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో తాను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నట్లు గుర్తుచేసుకుంది. ‘మోడలింగ్‌లోకి వెళ్తానని చెబితే .. ఫ్యామిలీ నుంచి అంతగా సపోర్ట్ అందలేదు. అయినా కూడా నా లక్ష్యం వైపే అడుగులు వేశాను. 2000లో నాతో పాటు ప్రియాంక చోప్రా, లారా దత్తా మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నం. ప్రియాంకకు ఫ్యామిలీ నుంచి ఫుల్ సపోర్ట్ ఉండేది. మాకు ఎవరూ సహకరించ లేదు. ముంబైలో లారా ఓ చిన్న ఇంట్లో అద్దెకు ఉండేది. నేను ముంబై వెళ్లిన ప్రతిసారి ఆమె ఇంట్లోనే ఉండేదాన్ని. డబ్బులు ఉండేవి కాదు. ఫ్యాషన్ షోలో పాల్గొనడానికి ఖరీదైన బట్టలు కొనేవాళ్లం కానీ.. తినడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండేది కాదు. ఆకలి తీర్చుకోవడం కోసం నూడుల్స్ తినేవాళ్లం. మా పరిస్థితి తలుచుకొని మేమే నవ్వుకునే వాళ్లం. ఖరీదైన దుస్తులు వేసుకున్నా..తినేది మాత్రం నూడుల్స్ అనుకునేవాళ్లం’ అంటూ దియా ఎమోషనల్ అయ్యింది. కాగా.. 2000 మిస్ ఇండియా పోటీల్లో లారా దత్తా విజేతగా కిరీటాన్ని అందుకోగా.. ఫస్ట్ రన్నరప్‌గా ప్రియాంకా చోప్రా, సెకండ్ రన్నరప్‌గా దియా మీర్జా నిలిచారు.

## కార్తీక్ ఆర్యన్, శ్రీలీల డేటింగ్ వార్తలు.. హీరో తల్లి ఆసక్తికర వ్యాఖ్యలు



ముంబయి: బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్, నటి శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజుల నుంచి బీటౌన్‌లో ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. కార్తీక్ ఫ్యామిలీ పార్టీలో శ్రీలీల పాల్గొనడంతో ఈ వార్తలు తెరపైకి వచ్చాయి. ఇదిలాఉండగా, తమ ఇంటికి ఎలాంటి అమ్మాయి కోడలిగా రావాలో తెలియజేస్తూ కార్తీక్ ఆర్యన్ తల్లి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘ఐఫా’ వేడుకల్లో పాల్గొన్న ఆమెను నిర్మాత కరణ్‌జోహార్ కాబోయే కోడలి గురించి ప్రశ్నించారు. ‘‘ఒక మంచి వైద్యురాలు మా ఇంటికి కోడలిగా రావాలని మేమంతా కోరుకుంటున్నాం’’ అని ఆమె తెలిపారు. నటిగా రాణిస్తోన్న శ్రీలీల.. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోన్న విషయం తెలిసిందే. చదువుతోపాటే కెరీర్‌లోనూ కొనసాగడంపై ఎన్నో సందర్భాల్లో ఆమె ఆనందం వ్యక్తంచేశారు. కార్తీక్ శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోన్న వేళ హీరో తల్లి వ్యాఖ్యలు వాటికి మరింత ఆజ్యం పోసేలా ఉన్నాయి. శ్రీలీలను ఉద్దేశించే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారని పలువురు భావిస్తున్నారు.

## అన్ని సినిమాలకు సంతకం..

# ఇంటికివెళ్లి ఏడ్చేవాడిని: ఆమిర్‌ఖాన్

అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ పుట్టినరోజును పీవీఆర్ ఐనాక్స్ ‘ఆమిర్ ఖాన్ : సినిమా కా జాదూగర్’ పేరుతో ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఆమిర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో అవగాహన లేక 10 సినిమాలకు సంతకం చేసి ఇబ్బంది పడినట్లు చెప్పారు. “నేను నటించిన ఓ సినిమా భారీ విజయాన్ని సాధించింది. ఆ తర్వాత నాకు 300- 400 సినిమా ఆఫర్లు వచ్చాయి. ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలో తెలియక ఒకేసారి చాలా వాటికి సంతకం చేసేశాను. అప్పట్లో కొందరు నటులు ఒకేసారి 50 సినిమాల వరకూ వర్క్ చేసేవారు. అనిల్ కపూర్ 33 సినిమాలు చేశారు. అది చూసి నేను కూడా ఒకేసారి 10 సినిమాలు అంగీకరించాను. కానీ, నేను పనిచేయాలని కలలు కన్న దర్శకులు ఎవరూ నాకు అవకాశాలు ఇవ్వలేదు. నేను సంతకం చేసిన సినిమాల షూటింగ్ ప్రారంభమయ్యాక తప్పు చేశానని అర్థమైంది. రోజుకు మూడు షిఫ్ట్‌లు వర్క్ చేసేవాడిని. ఒత్తిడితో ఇంటికి వెళ్లి ఏడ్చేవాడిని” అని చెప్పారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.